
లాటరీ తీస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

కల్లుగీత కార్మికులకు
9 మద్యం షాపులు
లాటరీ పద్ధతిలో కేటాయింపు

పుట్టపర్తిటౌన్, జనవరి24(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టింది. పది శాతం మద్యంషాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు జిల్లాలో వారికి 9 మద్యం షాపులు కేటాయించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో శుక్రవారం కల్లుగీత కార్మికుల సమక్షంలో కలెక్టర్ టీఎస్ చేతన్ లాటరీ ద్వారా గీత కార్మికుల్లోని మూడు ఉపకులాలకు మద్యం షాపులు కేటాయించారు. ఇందులో 7 షాపులు ఈడిగ కులస్తులకు, గౌడు, గౌడా కులాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు. కదిరి మున్సిపాలిటీ గౌడు, తాడిమర్రి షాపు గౌడలకు, హిందూపురం, ధర్మవరం మున్సిపాలిటీలు, చిలమత్తూరు, పుట్టపర్తి రూరల్, పెనుకొండ రూరల్, నంబులపూలకుంట మద్యం షాపులను ఈడిగ కులస్తులకు కేటాయించారు. ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదల చేసిన తరువాత ఈ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తామన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ.రెండు లక్షలు (నాన్ రీఫండ్‌బుల్) చెల్లించాలన్నారు. లైసెన్సు ఫీజులో మాత్రం 50శాతం రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపర్‌వైజర్ గోవిందునాయక్, బీసీ సంక్షేమాధికారి గంగాద్రి, సీఐ నాగరాజు, గీత కార్మిక ప్రతినిధులు గంగాధర్ గౌడ్, హరిక్రిష్ణగౌడ్ పాల్గొన్నారు.



కొండపై నుంచి గుండు పడుతున్నపుడు రేగిన దుమ్ము
కిందపడిన గుండు

దేవుడా..!
కొండపై నుంచి పడ్డ గుండు

తాడిమర్రి మండలంలోని పిన్నదరి, పుల్లానారాయణపల్లి మధ్యగల అక్కమ్మగారి కొండపై నుంచి పెద్ద గుండు శుక్రవారం ఉదయం ఉన్నఫలంగా కిందకు దొర్లుకుంటూ వచ్చింది. పనులకు వెళ్తున్న కూలీలు చూసి భయపడిపోయారు. భారీ బండరాయి నుంచి విడిపోయిన గుండు పొర్లుకుంటూ రావడంతో దుమ్ము రేగింది. ఏం జరిగిందోనని కూలీలు ఆందోళన చెందారు. ఆ సమయానికి బండరాయి దొర్లే ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

- తాడిమర్రి, ఆంధ్రజ్యోతి


ప్రసంగిస్తున్న దీపక్ ఓబ్రా


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రత్నాకర్

సత్యసాయి పంచసూత్రాలే
యువతకు పరమావధి
భారత మాజీ రాయబారి దీపక్ ఓబ్రా
ప్రశాంతి నిలయంలో లీడర్‌షిప్ సదస్సు ప్రారంభం

పుట్టపర్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యువతకు విద్యతోపాటు సత్యసాయి బోధించిన పంచసూత్రాలు పరమావధి కావాలని భారత మాజీ రాయబారి డాక్టర్ దీపక్ ఓబ్రా పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో శ్రీసత్యసాయి జాతీయ లీడర్‌షిప్ ప్రోగ్రాంపై మూడు రోజుల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ దీపక్ ఓబ్రా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. దేశ భవిత యువతపై ఆధారపడి ఉంటుందన్నారు. సత్యసాయి బోధించిన సనాతన ధర్మాలు, పంచసూత్రాలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస పరమావధిగా జీవనం సాగించాలన్నారు. ఉన్నత విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం యువతకు చాలా అవసరమన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందాలంటే వ్యక్తిత్వ వికాసం అవసరమన్నారు. సత్యసాయి విద్యావిధానం.. వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సత్యసాయి బోధనలు, ఆధ్యాత్మికత, ప్రేమతత్వాన్ని యువత పాటిస్తూ ఎదగాల్సి ఉందనీ, అప్పుడే ఉన్నత నాయకుడిగా మన్నన పొందగలరన్నారు. సాయంత్రం సత్యసాయి యువత ఐయాం డిఓషన్ పేరిట సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే, ట్రస్టు ప్రతినిధులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, ప్రోగ్రాం కన్వీనర్ యోగేంద్ర, 1500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన యువత


వైసీపీలో వర్గపోరు

మూడు నియోజకవర్గాల్లో తీవ్రం
మడకశిరలో తారస్థాయికి..
పురం, పెనుకొండలో చాపకింద నీరులా..

హిందూపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వైసీపీలో వర్గపోరు రాజుకుంటోంది. పార్టీ అధికారంలోకి రాకపోయినా ఇక్కడ పోరుమాత్రం ఆగలేదు. ఈ మూడుచోట్ల వర్గాలుగా విడిపోయి బజారుకెక్కుతున్నారు. ఇందులో మడకశిర మొదటి వరుసలో ఉండగా.. హిందూపురం, పెనుకొండ తరువాతి స్థానాల్లో నిలుస్తున్నాయని ఆ పార్టీ నాయకులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. చక్కదిద్దాల్సిన అధిష్టానం ఆ నియోజకవర్గాల నాయకులను అడపాదడపా మాట్లాడుతూ.. గాలికి వదిలేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూడు నియోజకవర్గాల్లో ఇదే తీరు..

మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో సమన్వయ కర్తలు, ముఖ్య నాయకుల మధ్య వర్గపోరు సాగుతూనే ఉంది. హిందూపురంలో సమన్వయకర్త దీపిక, నవీన్‌నిశ్చల్ వర్గాలు రాష్ట్ర నేతలవద్దకు వెళ్లి ఒకరినొకరు ఫిర్యాదు చేసుకున్నారు. పెనుకొండలో కూడా ఇద్దరు మాజీ మంత్రుల మధ్య సమన్వయకర్త పదవి కోసం రగడ జరుగుతూనే ఉంది. మడకశిరలో 2019 ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన డా.తిప్పేస్వామి అధికారంలో ఉండగా అడ్డంగా దోచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సొంత పార్టీ నాయకులే ఎన్నికల ముందు రోడ్డెక్కి విమర్శలు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయనను కాదని ఈరలక్కప్పను సమన్వయకర్తగా నియమించి, అనూహ్య పరిణామాల మధ్య 2024 ఎన్నికల్లో బరిలోకి దింపారు. డా.తిప్పేస్వామి వర్గీయులు ఒకమేర వ్యతిరేకించారు. అయినా ఈరలక్కప్పను బరిలో నిలిపారు. ఆయన.. ఎంఎస్ రాజు చేతిలో ఓటమిపాలయ్యారు. ఈరలక్కప్ప వెనుక గుడిబండ మండలానికి చెందిన ఓ నాయకుడు ఉండి అంతా తానై నడిపిస్తున్నట్లు నియోజకవర్గంలోని ఇతర వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పేరుకు మాత్రమే ఈరలక్కప్ప సమన్వయకర్తగా ఉంటున్నారనీ, మొత్తం వ్యవహారమంతా గుడిబండ మండలానికి చెందిన నాయకుడే నడిపిస్తున్నట్లు వైసీపీలో పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అక్కడ వైసీపీ సమన్వయకర్త కోసం ఇద్దరు జడ్పీటీసీలతోపాటు మరో నాయకుడు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ ముగ్గురు నాయకులు తమకు ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలోనే రెండ్రోజుల క్రితం ఈరలక్కప్ప, ఆయన వర్గీయులు దాడి చేశారని ఓ జడ్పీటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఈరలక్కప్పతోపాటు గుడిబండ మండలానికి చెందిన ఓ నాయకుడు, మరో 20 మందికిపైగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు పెట్టారు. ఈ కేసులో ఉన్న ఓ నాయకుడు ఇప్పటికే పరారీలో ఉండగా.. ప్రస్తుత వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప మాత్రం ఇక్కడే ఉన్నారు. ఆయనను ఈ కేసులో రేపో.. మాపో.. అరెస్టు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇదంతా ఇలా ఉంటే సొంత పార్టీ వారే సమన్వయకర్తపై ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసుపెట్టడం జిల్లాలో కలకలం రేపింది. దీనిపై శుక్రవారం గుడిబండ మండలంలో వైసీపీ నాయకులతో సమావేశం కూడా అయ్యారు. పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారిపై చర్యలు తీసుకునేలా ప్రస్తుత సమన్వయకర్త ఈరలక్కప్ప అధిష్టానంపై ఒత్తిడి తెచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. మడకశిర వైసీపీలో సాగుతున్న వర్గపోరు స్టేషన్ వరకు చేరింది. పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే. ఈ గొడవలు జరుగుతున్నది సమన్వయకర్త పదవి కోసమేనంటూ ఆ పార్టీలో పెద్దఎత్తున చర్చకు దారితీసింది.



చాపకింద నీరులా..

హిందూపురంలో పార్టీ ఆవిర్భావం నుంచి వైసీపీలో వర్గపోరు సాగుతూనే ఉంది. ఎన్నికల అనంతరం హిందూపురంలో ఉన్న ముఖ్యనేతల్లో ఒకరు చౌళూరు మధుమతిరెడ్డి కెనడాకు వెళ్లిపోయారు. కొండూరు వేణుగోపాల్ రెడ్డి తటస్థంగా ఉన్నారు. ఇక మిగిలిన సమన్వయకర్త దీపిక, ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్ వర్గాల మధ్య చాపకింద నీరులా వర్గపోరు సాగుతోంది. ఎప్పుడైనా ఈ రెండు వర్గాలు బజారుకు రావడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇందులో ఒక్కో నాయకుడికి ఒక్కో ముఖ్యనేత అండగా ఉండటంతో పోరుమాత్రం నిశ్శబ్ద విప్లవంగా పోతోంది. ఈ రెండువర్గాలు అధిష్టానం వద్ద సమన్వయకర్త పదవి కోసం పంచాయితీ పెట్టాయన్నది బహిరంగ రహస్యమే. ఎటూ తేల్చకుండా నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మాట్లాడతామని అధిష్టానం పెద్దలు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. అయినా ఈ రెండువర్గాల నాయకులు సోషల్ మీడియాలో పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు.

పెనుకొండలో...

పెనుకొండ వైసీపీలో ఇద్దరు మాజీ మంత్రుల మధ్య నియోజకవర్గ సమన్వయ కర్త పదవికోసం పోటీ జరుగుతోంది. పెనుకొండ సమన్వయకర్తగా ఉంటూ జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్న ఉషశ్రీపై మాజీ మంత్రి శంకర్‌నారాయణ వర్గీయులు అవకాశం దొరికినపుడల్లా ఆరోపణలు చేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం పెనుకొండ సమన్వయకర్త శంకర్‌నారాయణకు ఇవ్వాలని ఆయన వర్గీయులు పట్టుబట్టారు. ఇదే సందర్భంలో ఉషశ్రీకి ఉండాలని ఆమె వర్గీయులు కూడా రోడ్డెక్కారు. ఒకానొక దశలో విలేకరుల సమావేశాలు ఏర్పాటుచేసి ఇరువురు నాయకుల అనుచరులు సమన్వయకర్త పదవి కోసం మాట్లాడారు. పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం మౌనం వహించడంపై పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

పస్తులతో చదివి.. గొర్రెలు కాసి..

నిరుపేద కుటుంబం నుంచి ఉపకులపతి స్థాయికి..
గుల్‌బర్గా యూనివర్సిటీ వీసీ గోరు శ్రీరాములు విజయ ప్రస్థానం


ఉపకులపతి గోరు శ్రీరాములు

స్ఫూర్తి

బాల్యమంతా పేదరికమే..
గొర్రెలకు కాపలాగా వెళ్లాడు..
సేద్యం పనులు చేశాడు..
క్యారీ లేకుండా బడికెళ్లాడు..
పక్కూరికి నడుచుకుంటూ వెళ్లి..
నీరు తాగి కడుపు నింపుకున్నాడు..
పస్తులతో చదువుకున్నాడు..
దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటూ
ఉన్నత చదువులు చదివాడు..
ఏకంగా ప్రతిష్టాత్మక వర్సిటీకి
ఉపకులపతి అయ్యారు..
కష్టపడితే సాధించలేనిది
ఏదీ ఉండదని నిరూపించారు..
గోరంట్ల మండలం కమ్మవారిపల్లికి
చెందిన గోరు శ్రీరాములు..
ఆయన జీవనప్రయాణం..
స్ఫూర్తిదాయకం..

గోరంట్ల, జనవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో నిరుపేద కుటుంబంలో జన్మించిన గోరు శ్రీరాములు కర్ణాటకలోని గుల్‌బర్గా యూనివర్సిటీ ఉపకులపతి (వీసీ) స్థాయికి ఎదిగారు. కమ్మవారిపల్లికి చెందిన కదిరప్ప, పెద్దక్క దంపతులకు చివరి సంతానంగా 1963 జూన్ 10న జన్మించారు. శ్రీరాములుకు ఇద్దరు అన్నలు, ఒక సోదరి ఉన్నారు. రైతు కుటుంబం. తండ్రి కృషితో ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. గొర్రెలు మేపేవారు. చిన్నవాడైన శ్రీరాములు కమ్మవారిపల్లిలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఉన్నత విద్యకోసం గోరంట్లలోని హైస్కూల్‌కు రోజూ ఐదు కిలోమీటర్ల దూరం పుస్తకాల సంచితో వెళ్లి వచ్చేవారు. ఉదయాన్నే ఇంత అన్నం తిని, స్కూల్‌కు వచ్చేవారు. సాయంత్రం వరకు పస్తు ఉండేవారు. నీళ్లు తాగుతూ గడిపేవారు. చదువుకోవాలన్న తపనతో గురువుల ఇళ్ల వద్ద పనులు చేస్తూ మెప్పించేవారు. తరువాత బాగేపల్లిలో పీయూసీ చదివారు. 1982 నుంచి 85 వరకు బాగేపల్లి నేషనల్ కాలేజీలో బీఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. బెంగుళూరు యూనివర్సిటీలో ఎంఏ, ఎంఈడీ, ఎంఫిల్ చదివారు. 1998లో పీహెచ్‌డీ చేశారు. 2004లో కాకతీయ యూనివర్సిటీ నుంచి రెండో పీహెచ్‌డీ అందుకున్నారు. 1995లో గుల్‌బర్గాలో అధ్యాపకుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 2004లో రీడర్‌గా, తరువాత ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. రెండ్రోజుల క్రితం అదే యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు భార్య సంగీత, కుమార్తె సహన ఉన్నారు. శ్రీరాములు సేవా కార్యక్రమాలకు తన వంతు సాయం అందిస్తున్నారు.


వీసీ సోదరుడు గోరు ఓబుళప్ప

నేటికీ గొర్రెల పెంపకమే..

శ్రీరాములు వీసీ స్థాయికి ఎదిగినా ఆయన సోదరులు ఓబుళప్ప, రామకృష్ణ మాత్రం నేటికీ గొర్రెలు పెంచుతూ, వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. శ్రీరాములు మృదుస్వభావి, నిగర్వి అని ఆయన అన్న ఓబుళప్ప చెబుతున్నారు. వీసీ స్థాయికి ఎదిగినా.. తమ మాటకు ఎదురు చెప్పరంటున్నారు. నేటికీ తమ బాగోగులు చూస్తున్నారని తెలిపారు. తమ్ముడు వీసీగా బాధ్యతలు చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.


పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ తదితరులు

నేటికీ అదే అభిమానం
ఘనంగా పరిటాల రవి 20వ వర్ధంతి
వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
భర్తను తలుచుకుని పరిటాల సునీత కంటతడి

- వివరాలు 6లో...

పర్యాటక ఖిల్లా..!
జిల్లా అంతటా టూరిజం ప్రదేశాలు
దేశవిదేశాల నుంచి పర్యాటకుల రాక
నేడు జాతీయ పర్యాటక దినోత్సవం


లేపాక్షి ఆలయం వ్యూ

7

- నీటి ఎద్దడి నివారణకు చర్యలు
- జిల్లాకు రూ.5.87 కోట్లు కావాలని ప్రతిపాదనలు
- 284 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా
- తాగునీటి సమస్యపై టోల్ ఫ్రీ నంబరు 08555-292439



వేసవి ప్రణాళిక సిద్ధం..


పుట్టపర్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వేసవి రాబోతోంది. ఈ సమయంలో కరువు జిల్లాలో ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చే సమస్య నీటి ఎద్దడి. వేసవిలో ఎండల సంగతి అటుంచితే.. నీటి కష్టాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన జిల్లావాసులను చుట్టుముడుతుంది. గత వర్షాకాలంలో వర్షాలు కురిసి అక్కడక్కడ చెరువులు, కుంటలు నిండినా వేసవి తాగునీటి ఎద్దడి తప్పేట్టు లేదు. గత వైసీపీ పాలనలో తాగునీటి సరఫరాకు చిల్లిగవ్వ ఇవ్వకపోగా.. రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ అటకెక్కించారు. వేసవిలో గుక్కెడు నీటి కోసం జిల్లావ్యాప్తంగా జనం బండెడు కష్టాలు పడ్డారు. వీటిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఎక్కడెక్కడ తాగునీటి ఎద్దడి తలెత్తుతుందో గుర్తించి, ముందస్తు చర్యలకు కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. ఆ మేరకు ప్రణాళికలు రూపొందించి, పంపాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం జిల్లావ్యాప్తంగా పరిశీలించింది. జనవరి నుంచి జూన్ నెలలో వర్షాలు కురిసేదాకా తాగునీటి సమస్య తలెత్తే గ్రామాలను గుర్తించింది. ఎద్దడిని ఎదుర్కొనేందుకు రూ.5.87 కోట్లు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు.. ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలోని సీబీఆర్, గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలతోపాటు పలు చెరువుల్లో నీరున్నా ముందస్తు ప్రణాళికలతో ప్రజల దాహార్తి తీర్చేవిధంగా చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నిధులిస్తే నీటి కష్టాలు తీరినట్లే..

జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని గ్రామీణ నీటి సరఫరా విభాగాధికారులు గుర్తించారు. 284 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచి నీరు సరఫరా చేయాల్సి వస్తుందని ప్రణాళిక రూపొందించారు. ఆయా గ్రామాల్లో వేసవిలో తాగునీటి కష్టాలు తీర్చేందుకు రూ.5.12 కోట్లు అవసరమని ప్రతిపాదనలు చేశారు. ఆమడగూరు, ముదిగుబ్బ, అగళి, మడకశిర, గుడిబండ, రొళ్ల, అమరాపురం, గోరంట్ల, సోమందేపల్లి, రొద్దం, పరిగి, పెనుకొండ, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, చెన్నేకొత్తపల్లి, నంబులపూలకుంట, బత్తలపల్లి, ధర్మవరం, కదిరి మండలాల్లోని పలు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని నివేదించారు. 80 గ్రామాల్లో బోర్లను మరింత లోతుకు తవ్వడం, మరమ్మతులు చేపట్టి గ్రామీణ నీటి సమస్య తీర్చాల్సి ఉంది. ఇందుకు రూ.85 లక్షలు అవసరమని నివేదించారు. ఫిబ్రవరిలో బోర్ల ఫ్లాష్ ప్రోగ్రామ్ చేపట్టనున్నారు. వేసవిలో ఎండవేడిమిని బట్టీ తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని అధికార యంత్రాంగం భావిస్తోంది. ప్రభుత్వం నిధులిచ్చిన వెంటనే అవసరమైన చోట్ల పనులు చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



తాగునీటి ఎద్దడి రానివ్వం



జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందించాం. ఎక్కడెక్కడ సమస్య వస్తుందో ఇప్పటికే గుర్తించాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి రూ.5.87 కోట్ల నిధులివ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. అనుమతులు రాగానే ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు చేస్తాం. జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తాం. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తితే ప్రజలు టోల్‌ఫ్రీ నంబరు 08555292439కు ఫిర్యాదు చేయవచ్చు.

- మల్లికార్జున, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్


పరిటాల రవి ఘాట్ వద్దకు రకరకాల వంటకాలను తీసుకొస్తున్న కుటుంబసభ్యులు


పరిటాల రవి ఘాట్ వద్ద మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె తదితరుల నివాళి







నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సిద్ధార్థ, శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

నేటికీ అదే అభిమానం

ఘనంగా పరిటాల రవి 20వ వర్ధంతి

వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు

భర్తను తలుచుకుని పరిటాల సునీత కంటతడి

రామగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గతించి రెండు దశాబ్దాలు గడిచినా పరిటాల రవీంద్రపై అభిమానం ఏమాత్రం చెక్కు చెదరలేదు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించేందుకు అభిమానులు వెంకటాపురానికి పోటెత్తారు. మాజీమంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని వేలాది మంది అభిమానుల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, తనయులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వెంకటాపురంలోని ఘాట్ వద్దకు వచ్చి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అభిమానులు పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. పరిటాల రవీంద్ర చరిత్రను కీర్తిస్తూ నిర్వహించిన జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పరిటాల రవీంద్రఘాట్‌కు నివాళులర్పించిన వారిలో మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, కర్ణాటక మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, తెలంగాణ నుంచి వచ్చిన అభిమానులు ఉన్నారు. కార్యక్రమానికి వచ్చిన వారందరికీ అన్నదానం చేశారు.

వందేళ్ల తరువాత కూడా పరిటాల రవి పేరు చెప్పుకునేలా చేస్తాం: పరిటాల శ్రీరామ్

వందేళ్ల తరువాత కూడా పరిటాల రవిపేరు చెప్పుకునేలా తాము పని చేస్తామని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటా శ్రీరామ్ పేర్కొన్నారు. ఆయన మొదటి వర్ధంతి రోజు ఏ స్థాయిలో జనం వచ్చారో అదే స్థాయిలో నేడు కూడా ప్రజాభిమానం కనిపిస్తోందన్నారు. ప్రజాఉద్యమాలలో ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికి మరువలేమన్నారు. ఆయన కలలు, ఆశయాల కోసం పని చేస్తామన్నారు. మాకు తండ్రి లేని లోటు తీర్చిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం చివరి వరకు పనిచేస్తామన్నారు.

మడమ తిప్పని వ్యక్తి : బీకే పార్థసారథి, ఎంపీ, హిందూపురం

మాట ఇచ్చాడంటే మడమ తిప్పని వ్యక్తి పరిటాల రవీంద్ర అని ఎంపీ పార్థసారథి పేర్కొన్నారు. 1993ప్రాంతంలో ధర్మవరం, తాడిపత్రి, పెనుకొండ ప్రాంతాల్లో టీడీపీ జెండా పట్టుకునే వారే లేరని, ఆయనరాకతో పార్టీ అభిమానులు, కార్యకర్తల్లో ధైర్యం వచ్చిందన్నారు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చి జిల్లా టీడీపీని ముందుకు తీసుకెళ్లారన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది పరిటాల రవి అని, బతికిఉన్నంత వరకు ఆయనను మరువలేమన్నారు.

బడుగుల ఆశాజ్యోతి: కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే, రాయదుర్గం

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పరిటాల రవీంద్ర అని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆపద సమయంలో పార్టీకి ఆయన కొండంత అండగా నిలుస్తూ పార్టీశ్రేణుల్లో ధైర్యాన్ని నింపారన్నారు. వందలాది జంటలకు ఉచిత వివాహాలు జరిపించిన మహోన్నత వ్యక్తి పరిటాల రవీంద్రఅన్నారు.

వ్యక్తి కాదు.. ఒక శక్తి: దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే, అనంతపురం

పరిటాల రవి ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. టీడీపీ జెండా పట్టుకోవాలంటే భయపడే పరిస్థితుల నుంచి పార్టీకి జిల్లాను కంచుకోటగా మార్చారన్నారు. 20వ వర్ధంతి కాదు 100 వర్ధంతులు జరిగినా ఆయనపై ప్రజలకున్న అభిమానం తరగదన్నారు.

పరిటాల సునీత కంటతడి

పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పించే సమయంలో ఆయన సతీమణి ఎమ్మెల్యే పరిటాల సునీత భావోద్వేగానికి లోనయ్యారు. అక్కడే కాసేపు కుర్చొని కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనవరి నెల వచ్చిందంటే ఏదో తెలియని బాధ కలుగుతుందన్నారు. నేటికీ వేలాది మంది తరలి వచ్చి నివాళులర్పిస్తుంటే ప్రజల గుండెల్లో ఆయన ఎంత పదిలంగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఈనేల ఉన్నంతవరకు పరిటాల రవీంద్రను ఎవరు మరువరన్నారు. ఆరోజు ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ఆహ్వానించడమే కాకుండా, ఒక తండ్రిగా అండగా నిలిచారన్నారు. పరిటాల రవీంద్రకు భార్యగా ఉండటం నాకు దక్కిన గొప్పవరమన్నారు. ఆయన మరణం తరువాత ఎదుర్కొన్న కష్టాలు పగవాడికి కూడా రాకూడదన్నారు. ఆయనను ఫ్యాక్షనిస్టుగా ముద్రవేశారని, కానీ ఆయన ఫ్యాక్షన్‌నుంచి ఎన్నోగ్రామాలకు విముక్తి కలిగించి అభివృద్ధి చేశారన్నారు. తమ కుటుంబ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

పరిటాల ఆశయాలు గొప్పవి : పల్లె సింధూరారెడ్డి, ఎమ్మెల్యే, పుట్టపర్తి

ఒక వ్యక్తిపై ఇంత మంది ప్రేమాభిమానులు చూపిస్తున్నారంటే పరిటాల రవి ఎంత గొప్ప వ్యక్తో అర్థమవుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు పరిటాల రవీంద్ర అండగా నిలిచారని, అలాంటి వ్యక్తి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. చివరి వరకు ఆయన ఇచ్చిన మాటకోసమే పనిచేశారు.


తరలివచ్చిన పరిటాల అభిమానులు, టీడీపీ కార్యకర్తలు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ, ఆలం నరసానాయుడు తదితరులు

ప్రజాదరణ తరగని నేత: అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

మరణించి 20ఏళ్ల అయినా ఇప్పటికి ప్రజాదరణ తగ్గనినేతగా పరిటాల రవీంద్ర ఉన్నారని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమలినేని సురేంద్రబాబు వెల్లడించారు. ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. అందుకే ఆయన నేటికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాపోయారని కొనియాడారు.

పెనుకొండలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం : మంత్రి సవిత

బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్యదైవంగా పరిటాల రవి నిలిచారని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ రోజు ఈ ప్రాంతంలో ఇంత స్వేచ్ఛగా కనిపిస్తోందన్నా, ఆడబిడ్డలు ధైర్యంగా బయట తిరుగుతున్నారన్నా అది కచ్చితంగా పరిటాల రవి చేసిన పోరాట ఫలితమే అన్నారు. శ్రీకాకుళం ప్రాంతంలో కూడా పెనుకొండపేరు చెబితే అది పరిటాల రవి నియోజకవర్గం కదా అంటున్నారంటే ఆయన ఈ ప్రాంతంపై ఎలాంటి ముద్ర వేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే పెనుకొండలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు. పరిటాల సునీత ఒక వీర వనిత అని పేర్కొన్నారు.

పోరాటాలకు స్ఫూర్తి పరిటాల రవీంద్ర: ఎంఎస్‌రాజు, ఎమ్మెల్యే, మడకశిర

జిల్లాలో రాజకీయ, ప్రజాపోరాటాలకు స్ఫూర్తి పరిటాల రవీంద్ర అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఆయన అనంతపురం జిల్లాలో కాకుండా రాష్ట్రంలోనే పేరున్న నాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

జిల్లాపై చెరగని ముద్ర : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

జిల్లా రాజకీయాలపై పరిటాల రవీంద్రది చెరగని ముద్ర అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పరిటాల రవీంద్రతో 1993 నుంచి 2005 వరకు తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను పల్లె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో కూడా టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.

ప్రాణాలు తీస్తారని తెలిసినా వెనక్కి తగ్గలేదు: హనుమంతరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యే

2004లో అధికారం కోల్పోయాక శత్రువులు తనను హతమార్చడానికి పొంచి ఉన్నారని తెలిసిన వెనక్కి తగ్గని ధైర్యశాలి పరిటాల రవీంద్ర అని మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి పేర్కొన్నారు. కొన్ని రోజులు బయటకు వెళ్లి ప్రాణాలు కాపాడుకోవాలని సూచిస్తే తాను వెళితే తనవాళ్లు అన్యాయం అవుతారని ధైర్యంగా నిలబడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

బడుగులకు రాజకీయ అవకాశాలు: తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

ఉమ్మడి జిల్లాల ఓట బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన వ్యక్తి పరిటాల రవి అని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కొనియాడారు. ఆయన ఆశయాలు ఎంతో గొప్పవని అందుకే ఆయన ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.


నివాళులర్పిస్తున్న చమన్ సతీమణి, తనయుడు


ఎంపీ బీకే, ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్..


అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ...


అనంతపురం జిల్లా టీడీపీ నేతలు...

సాయం చేసి.. చోరీ

ఇంటి యజమానిని ఆస్పత్రికి చేర్చి.. 10తులాల బంగారు ఆభరణాల అపహరణ

గంటల్లో పట్టేసిన వన్‌టౌన్ పోలీసులు.. సొమ్ము రికవరీ

అనంతపురం క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో సాయం చేసిన వ్యక్తే ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన సంఘటన నగరంలోని రాణీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. నగరంలోని రాణినగర్‌లో మహమ్మద్ నబీ రసూల్(58)కుటుంబం నివాసముంటోంది. రసూల్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. గురువారం కుమార్తె కొడుకు(మనవడు)డికి సంబంధించి తల వెంట్రుకలు తీయించే కార్యక్రమం నిర్వహించారు. దీంతో కొడుకులు, కుమార్తె వచ్చారు. రాత్రి ఫంక్షన్ అయిపోయాక అర్ధరాత్రి 12గంటల సమయంలో నబీ రసూల్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంలో పక్క ఇంట్లో ఉంటున్న గౌస్‌మోద్దీన్ ఆటోలో తీసుకెళ్లడానికి సాయం చేస్తూ వారితో పాటే ఆటోలో వెళ్లాడు. కుటుంబసభ్యులందరూ అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో ఓ వృద్ధురాలిని మాత్రమే ఉంచి వచ్చారు. బయట గేటుకు తాళం వేసి వెళ్లారు. ఆసుపత్రిలో రసూల్ చికిత్స పొందుతున్న సమయంలో మహిళలు.. ఇంట్లోనే బంగారు ఆభరణాలు ఉంచి వచ్చామని, కనీసం బీరువాలో ఉంచలేదని మాట్లాడుకోవడం గౌస్ మోద్దీన్ విన్నాడు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నబీ రసూల్ మృతి చెందాడు. కుటుంబసభ్యులు విషాదంలో ఉండిపోయారు. అరగంట తరువాత గౌస్‌మోద్దీన్ నేరుగా రసూల్ ఇంటికి వచ్చాడు. గేటు దూకి లోపలికెళ్లాడు. ఇంట్లో ఉన్న వృద్ధురాలు ఏం వచ్చావని ప్రశ్నిస్తే నబీరసూల్ చనిపోయాడని ఆ విషయం మీకు చెబుదామమని వచ్చానన్నాడు. ఇంట్లో తచ్చాడుతుంటే వృద్ధురాలు ప్రశ్నించగా ఆధార్‌కార్డు తీసుకురమ్మని చెప్పారని చెప్పాడు. ఈక్రమంలోనే వృద్ధురాలికి మస్కా కొట్టి మంచంపైన పరుపుకింద ఉన్న 10తులాల బంగారు ఆభరణాలు తీసుకుని ఉడాయించాడు. ఉదయం ఇంటికొచ్చిన కుటుంబసభ్యులు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. వృద్ధురాలి అనుమానం మేరకు నబీరసూల్ కుమారుడు దూదేకుల షానూర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ అప్రమత్తమయ్యారు. సిబ్బందితో కలిసి గంటల వ్యవధిలోనే గౌస్‌మోద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా గౌస్‌మోద్దీన్ తాను చేసిన నేరం ఒప్పుకున్నాడు. అతడి నుంచి 10తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.


చోరీ జరిగిన ఇల్లు

31న ఉమ్మడి జిల్లాకు ఎక్సైజ్ మంత్రి 'కొల్లు' రాక

అనంతపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటనకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ కమిషనర్ నిశాంత్‌శర్మ, డైరెక్టర్ రాహుల్‌దేవ్ వర్మ ఈ నెల 31న రానున్నారు. ప్రైవేట్ మద్యం దుకాణాల నిర్వహణ ఎలా సాగుతోంది..? అక్రమ మద్యం అరికట్టడంలో అధికారులు ఏ విధంగా పనిచేస్తున్నారు..? బెల్టుషాపులను నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారుల పనితీరు తదితర అంశాలపై వీరు సమీక్షించ నున్నారు. పర్యటనలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలోని పాలసముద్రం సమీపంలో ఐఎంఎల్ డిపో భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేస్తారు. తర్వాత అనంతపురం నగర శివారులోని సోములదొడ్డి వద్ద నిర్మించిన ఐఎంఎల్ డిపో భవనాన్ని ప్రారంభిస్తారు. 2014లో ఇక్కడ ఉన్న ఐఎంఎల్ డిపో అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. దీంతో అక్కడే కొత్త భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్నే మంత్రి ప్రారంభించనున్నారు. కాగా... నవోదయం 2.0 రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా నుంచే ప్రారంభించనున్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఎక్సైజ్ శాఖ పనితీరుపై మంత్రి సమీక్ష చేయనున్న నేపథ్యంలో ఆ శాఖాధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం. దీనికి తోడు బెల్టు తీసేదెవరు..? శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనం నేపథ్యంలో... అనధికారిక పర్మిట్ రూములు, బెల్టుషాపులు నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు సమాచారం.

వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. కామ్రేడ్ జెడ్ వీరారెడ్డి 20వ వర్ధంతిని శుక్రవారం సాయంత్రం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, గుత్తి సమితి ప్రెసిడెంట్‌గా, కమ్యూనిస్టు నేతగా వివిధ రంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి వీరారెడ్డి అని కొనియాడారు. అనేక పోరాటాల్లో రాటుదేలిన వీరారెడ్డి చనిపోయి 20 సంవత్సరాలైనప్పటికీ ఆయన స్ఫూర్తిని నెమరు వేసుకుంటూ నేటి సీపీఎం నాయకత్వం జిల్లాలో పెద్దఎత్తున రైతు, కార్మిక పోరాటాలతో ఆందోళనలను కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌వీ నాయుడు, ముత్తుజా, వెంకటనారాయణ, ఇర్ఫాన్, ఓబులేసు, రాజు, ప్రకాష్‌రెడ్డి, ఎర్రిస్వామి, గఫూర్, బాలకృష్ణ, ఆదినారాయణ, పోతులయ్య, శంషాద్, లాలెమ్మ, మాబ్బి తదితరులు పాల్గొన్నారు.



వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్


మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శివకార్తికేయరెడ్డి, కమిటీ సభ్యులు

పామిడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో శుక్రవారం ప్రభుత్వ వైద్యుడు కమలాధర్ అరుదైన ఆపరేషన్ చేశారు. పట్టణంలోని తిరుమలేసు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. పరీక్షించిన వైద్యులు దెర్మాయిడ్ సిస్ట్ ఆపరేషన్ చేయాలని సూచించారు. వైద్యుడు కమలాధర్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తికేయరెడ్డి, కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన వైద్యుల ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఎన్నో శస్త్ర చికిత్సలను ఇక్కడే విజయవంతంగా చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, హెడ్ నర్సు శివకుమారి, ఓటీ అసిస్టెంట్ అంజనప్ప, కమిటీ సభ్యురాలు పూజారి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.17,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 20 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



రిపబ్లిక్ డే ఏర్పాట్ల పరిశీలన


పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జేసీ

అనంతపురం టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసుపరేడ్ మైదానంలో రిపబ్లిక్‌డే ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేపడుతూ వస్తోంది. జిల్లా ఎస్పీ జగదీష్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడే అధికారులతో సమావేశమై ఏర్పాట్లు విషయంలో ఎక్కడెక్కడా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆదేశాలు జారీ చేశారు. వేడుకలు వీక్షించడానికి వచ్చే వారికి అవసరమైన కుర్చీలు, గ్యాలరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రిహార్సల్స్ చేయించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, డీపీఎం ఆనంద్, సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.10



అనంతపురంరూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1,350 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

ఏపీ హ్యాండ్‌బాల్ జట్టుకు ఇంటర్ విద్యార్థి


రాజును అభినందిస్తున్న శామ్యూల్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్‌జీఎఫ్(స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) హ్యాండ్‌బాల్ పోటీలకు కంబదూరుకు చెందిన విద్యార్థి రాజు ఎంపికయ్యాడు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 27వతేదీ నుంచి నిర్వహించే 38వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ రాష్ట్ర జట్టు తరఫున రాజు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన రాజును విద్యాశాఖ ఆర్‌డీ శామ్యూల్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శివశంక ర్, పీడీలు కేశవమూర్తి, శ్రీనివాసులు, నాగరాజులు అభినందనలు తెలిపారు.

జాతీయ ఉత్తమ రైతుగా రమేష్‌నాయుడు



ఆత్మకూరు జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. సిద్దరాంపురం గ్రామానికి చెందిన రాజనేని రమేష్‌నాయుడుకు జాతీయ ఉత్తమ రైతు అవార్డు లభించింది. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతులు మీదుగా అందుకోనున్నారు. ఉద్యాన పంటల్లో మంచి దిగుబడులు సాధించడంతో పాటు పండ్లతోటలను వినూత్న రీతిలో సాగుచేయడంలో రైతులకు ఆదర్శంగా నిలిచారు. దీంతో ఉత్తమరైతు అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. అవార్డు సాధించిన రమేష్‌నాయుడును పలువురు రైతులు అభినందించారు.


లేపాక్షి ఆలయం

పర్యాటక ఖిల్లా..!

జిల్లా అంతటా టూరిజం ప్రదేశాలు
దేశవిదేశాల నుంచి పర్యాటకుల రాక
నేడు జాతీయ పర్యాటక దినోత్సవం


చిత్రావతి నదిలో బోటింగ్

పుట్టపర్తి, జనవరి24(ఆంధ్రజ్యోతి): శిల్పకళల కాణాచి లేపాక్షి, రాయల రెండో రాజధాని పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ అతిథి పక్షులు విడిదిచేసే వీరాపురం, ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, తిమ్మమ్మ మర్రిమాను ఇలా చెప్పుకుంటూపోతే జిల్లా అంతటా పర్యాటక, చారిత్రక విశేషాలే. జిల్లా పర్యాటకానికి ఖిల్లా అనడంలో అతిశయోక్తి లేదు. చారిత్రక సంపదకు కొదువలేదు. ప్రతిరోజూ దేశవిదేశాల నుంచి పర్యాటకులు జిల్లాకు వస్తున్నారు. ఇలాంటి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబరులో నిర్వహించిన పర్యాటక శాఖ సమీక్షలో పర్యాటక అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించారు. పర్యాటక సర్క్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటన్నింటిని పర్యాటకంగా అభివృద్ధి చేసి జిల్లాను టెంపుల్ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.


గొల్లపల్లి రిజర్వాయర్

అభివృద్ధికి చర్యలు

జిల్లాను టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేసేందుకు ఇటీవల కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన పర్యాటక, పురావస్తు, దేవదాయ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాల్లో ప్రాజెక్టులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. శిల్పకళాక్షేత్రం లేపాక్షిలో జటాయువు థీమ్‌పార్కు, ఫుడ్ కోర్టు, స్టాల్స్ ఏర్పాటు, పర్యాటకులకు అదనపు గదులు, మౌలిక సదుపాయాల కల్పన, ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం, గొల్లపల్లి రిజర్వాయర్‌లో బోటింగ్, తనకల్లు మండలం కోటపల్లిలో రేస్‌ట్రాక్, థీమ్ లగ్జరీ రిసార్ట్ పీపీపీ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రతిపాదనలు చేశారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను ప్రత్యేక పర్యాటక వలయాలుగా (సర్క్యూట్) తీసుకువచ్చేందుకు కార్యాచరణ మొదలు పెట్టారు. ఇప్పటికే పుట్టపర్తిలో చిత్రావతి రిజర్వాయర్‌తోపాటు బుక్కపట్నం చెరువులో బోటింగ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇంకా బోటింగ్ ఏర్పాటుకు అనుకూలతలపై ఆరా తీస్తున్నారు. అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో పెనుకొండకు దేశవిదేశీయుల తాకిడి పెరిగింది. ఇక్కడ పర్యాటకంగా అభివద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక సర్క్యూట్‌తో ఇప్పటికే బెంగళూరు నుంచి లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, హార్సిలీహిల్స్ మీదుగా బెంగళూరుకు పర్యాటక వలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి వసతులతో అన్ని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది.


నంది విగ్రహం



ఖాద్రీశుడి ఆలయం

తెరపైకి ప్రత్యేక వలయం..

ఎంతో శిల్పకళా వైభవం ఉన్న లేపాక్షి ప్రపంచానికి తెలిసినా వారసత్వ సంపద గుర్తింపు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతేడాది జనవరి 16న ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోపాటు జీ-20 దేశాల ప్రతినిధులు సైతం లేపాక్షిని సదర్శించారు. దీంతో ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది. గత టీడీపీ ప్రభుత్వం లేపాక్షి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, ప్రాచుర్యాన్ని ముందుకు తీసుకువచ్చింది. లేపాక్షిని ప్రపంచస్థాయి ఆకర్షించాలా 2016, 2018లో లేపాక్షి నంది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పది కోట్లకుపైగా నిధులు విడుదల చేసి, అభివృద్ధి పనులు చేపట్టారు. లేపాక్షికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తీసుకువచ్చినట్లయింది. రెండేళ్ల కిందట యునెస్కో తాత్కాలిక జాబితాలో లేపాక్షికి చోటు లభించింది. వారసత్వ సంపద గుర్తింపు దక్కింది. ఇటీవల లేపాక్షికి పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరిగింది.


కదిరి ప్రాంతంలో..

కదిరి: ప్రసిద్ధిచెందిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన ప్రపంచంలోనే అతి పెద్దదైన తిమ్మమ్మ మర్రిమాను, ప్రజాకవి యోగివేమన సమాధి, బట్రేపల్లి జలపాతం, పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానాలు కదిరి ప్రాంతంలోని ప్రధాన పర్యాటక ప్రదేశాలు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి, స్వయంభుగా వెలిశారు. ఆయన తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కర్ణాటక, తమిళనాడులో వేలాదిమంది భక్తులకు అరాధ్యదైవం. ప్రహ్లాదసమేతుడైన లక్ష్మీనరసింహస్వామి ఇక్కడ స్వయంభుగా వెలిశారు. దేశంలోనే అతి పెద్ద మూడో రథం కదిరిలో ఉంది.


తిమ్మమ్మ మర్రిమాను

ప్రపంచంలోనే పెద్ద చెట్టు

ప్రపంచంలోనే అతి పెద్దదిగా నంబులపూలకుంట మండలంలోని గూటిబైలులో గల తిమ్మమ్మ మర్రిమాను గిన్నిస్ బుక్ రికార్డులకెక్కింది. 500 ఏళ్ల వయసున్న ఈచెట్టు దాదాపు 9 ఎకరాల్లో విస్తరించి ఉంది. తిమ్మమాంబ నాటిన ఈచెట్టు శాఖోప శాఖలుగా విస్తరించిందని భక్తులు చెబుతారు. ప్రజాకవి యోగివేమన సమాధి కదిరినుంచికేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. కదిరి, రాయచోటి రహదారిలోని కటారుపల్లి క్రాస్‌నుంచి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. తన పద్యాలతో సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేసిన ప్రజాకవి యోగివేమన సమాధి ఇక్కడ ఉంది. కదిరి-పులివెందల రహదారిలో బట్రేపల్లి జలపాతం ఉంది. వర్షాకాలంలో జలపాతం కనువిందు చేస్తుంది. పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది సందర్శనకు వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.



సత్యసాయి మహాసమాధి

న్యూస్ బాక్స్

803 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 803 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 454 క్యూసెక్కులు వెళ్తున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

లేపాక్షి విద్యార్థికి అరుదైన గౌరవం


సాయికిరణ్

లేపాక్షి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి సాయికిరణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఈనెల 26న గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి విద్యార్థికి ఆహ్వానం అందినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. విద్యార్థి స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాలలో గతేడాది పదో తరగతి చదివాడు. ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచాడు. దీంతో విద్యార్థికి ఆహ్వానం అందినట్లు తహసీల్దార్ వివరించారు. విద్యార్థిని అధికారులు, స్థానికులు అభినందించారు. విద్యార్థి ప్రస్తుతం హిందూపురంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

అంతర్జాతీయ జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థి

ధర్మవరంరూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అఫ్జల్‌మెహరాజ్ అంతర్జాతీయ జూడో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో విద్యార్థి కాంస్య పతకం సాధించాడు. తద్వారా అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 25వ తేదీ నుంచి భోపాల్‌లోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టు తరఫున అఫ్జల్ మెహరాజ్ ప్రాతినిధ్యం వహిస్తారని పీఈటీ తెలిపారు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


పోటీలకు ఎంపికైన అఫ్జల్ మెహరాజ్

బ్యాక్ డోర్ ఉద్యోగం.. పెద్ద మోసం..!

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశలు
- రూ.లక్షలు వసూలు
- కొన్నాళ్లపాటు మాయమాటలు
- తర్వాత స్పందించని వైనం
- లబోదిబోమంటున్న బాధితులు



హిందూపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగాన్ని కూడా మోసగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఐటీ, నాన్ ఐటీ కంపెనీల్లో అడ్డదారిలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి, రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, ఆశలు రేపుతున్నారు. డబ్బులు ఇస్తే.. అడ్డదారిలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. వాటిని నమ్మి రూ.లక్షలు మోసగాళ్ల చేతిలో పెడుతున్నారు. తర్వాత కొన్నినెలలపాటు అదిగో.. ఇదిగో.. ఉద్యోగం అంటూ నమ్మిస్తున్నారు. కొన్ని నెలలకు మోసగాళ్ల ఫోన్ నంబర్లు పనిచేయకుండా పోతున్నాయి. డబ్బు పోగొట్టుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు.

ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగం ఇప్పిస్తామంటూ..

బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, డిగ్రీలు చదివి లక్షలాది మంది యువతీయువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఏటా లక్షల మంది విద్యార్థులు డిగ్రీలు, ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని, బయటకు వస్తున్నారు. వీరిలో కొందరికే ఉద్యోగాలు దొరుకుతున్నాయి. చాలామంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. వారు ఉద్యోగాన్వేషణలో పడుతున్నారు. నగరాలకు వెళ్లి చిన్నాచితకా ఉద్యోగులు చేసుకుంటున్నారు. చదువుకు తగిన ఉద్యోగం రాక, ఇతర పనులు చేయలేక సతమతమవుతున్నారు. ఎన్నో వ్యయప్రయాలకోర్చి పిల్లలను చదివిస్తే ఉద్యోగం రాక వారు పడుతున్న బాధలు చూసి, తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారు. ఇలా ఎన్ని సంవత్సరాలు ఎదురు చూసినా ఉద్యోగాలు రావనీ, వేరే మార్గం ఉందని నమ్మిస్తున్నారు. డబ్బులు ఇస్తే బ్యాక్‌డోర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. పరీక్షలు రాయనక్కరలేదనీ, ఇంటర్వ్యూ తాము చూసుకుంటామని చెబుతున్నారు. మేనేజర్లతో మాట్లాడుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామంటూన్నారు. ఉద్యోగాలు రాక నిరాశతో ఉన్న విద్యార్థులు ఈ విషయాలను తల్లిదండ్రులకు చెబుతున్నారు. కొంతమంది నేరుగా తల్లిదండ్రులతోనే మాట్లాడుతున్నారు. పిల్లలకు ఉద్యోగం వస్తే చాలని తల్లిదండ్రులు.. మోసగాళ్ల వలలో పడుతున్నారు. వారు అడిగినంత సొమ్ము చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. అప్పులు చేసి.. మరీ డబ్బు చెల్లిస్తున్నారు. రెండు నెలల్లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బు తీసుకుంటున్నారు. ఐటీ ఉద్యోగానికైతే రూ.2.5 లక్షలు, నాన్ ఐటీకైతే రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. డబ్బు ముట్టాక కొన్నిరోజులు మాటలు చెబుతున్నారు. ఉద్యోగం ఇప్పించే పనిలోనే ఉన్నామంటారు. ప్రస్తుతం కంపెనీలోనే ఉన్నామనీ, ఉద్యోగం గ్యారంటీ అంటారు. తరువాత మెల్లగా ఫోన్ తీయడం మానేస్తారు. అనంతరం ఫోన్ నంబర్ మార్చేస్తారు. మోసపోయామని గ్రహించిన తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇంకొంతమంది డబ్బు ఇచ్చి ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

రూ.రెండు లక్షలు ఇచ్చా

బీటెక్ పూర్తి చేశా. క్యాంపస్‌లో ఉద్యోగం రాలేదు. ఉద్యోగాన్వేషణలో ఉన్నాం. తెలిసిన వారి ద్వారా ఫలానా వ్యక్తిని కలిస్తే బ్యాక్‌డోర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. రూ.2 లక్షలు ఇచ్చా. ఏడాది గడిచిపోయింది. అదిగో.. ఇదిగో అంటున్నాడు. ఇంకా ఆశగా ఎదురు చూస్తున్నా.

- ఓ నిరుద్యోగి, హిందూపురం

ఉద్యోగం ఇప్పిస్తానంటే డబ్బు ఇచ్చా

ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నా. బ్యాక్‌డోర్ ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానంటే డబ్బు ఇచ్చా. నెలలు గడిచి పోతున్నా ఉద్యోగం ఇప్పించకపోగా.. ఫోన్ కూడా తీయడం లేదు. మోసపోయానేమో అనిపిస్తుంది. అసలే చాలా సమస్యల్లో ఉన్నాం. ఇలాంటి సమయంలో ఉద్యోగం రాకపోతే బతుకే భారమవుతుంది.

- ఓ విద్యార్థిని



కాలువ నుంచి ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్న దృశ్యం


ఓ వెంచర్‌లో కాలువ మట్టిని చదును చేస్తున్న దృశ్యం

మట్టిని మింగేస్తున్నారు..!

- కాలువ మట్టిని తవ్వి, వెంచర్లకు తరలిస్తున్న వైనం
- అక్రమ రవాణాతో లక్షలు గడిస్తున్న మాఫియా

ఉరవకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టిమాఫియా రెచ్చిపోతోంది. హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువ గట్టు నుంచి ఎలాంటి అనుమతు లు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఈ తతంగం అంతా కళ్లముందే జరుగుతున్న అన్ని శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. నల్లరేగడి భూముల్లో వెంచర్లు వేయడంతో ప్లాట్లు అమ్ముకోవడానికి రియల్ వ్యాపారులు ఈ మట్టిని అందులోకి తరలిస్తున్నారు. ఈక్రమంలోనే మట్టి మాఫియా లక్షలాది రూపాయలు గడిస్తోంది. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు పలుకుబడి ఉన్న వ్యక్తులు మట్టితో వ్యాపారం చేస్తున్నారు. ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో వెంచర్లు పుట్టగొడుగుల్లాగా వెలుస్తున్నాయి. వెంచర్‌లో రహదారుల ఏర్పాటుకు, భూమిని చదును చేసేందుకు మట్టి అవసరమవుతుంది. దీంతో అక్రమార్కులు కన్ను హంద్రీనీవా, హెచ్చెల్సీ కాలువ గట్లపై పడింది. వెంచర్లతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టే వారితో ఒప్పందాలు కుదుర్చుకుని మట్టిని తరలిస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.800 దాకా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. జాతీయ రహదారి వెంబడి మట్టిని తరలిస్తున్నా అధికారులు నిమ్మకుండిపోయారు. ఈ విషయంపై హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఏఈ భాస్కర్‌ను వివరణ కోరగా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. గతంలోనూ మట్టిని తరలిస్తుండగా ట్రాక్టర్ యజమానులు మందలించాం. పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆస్ట్రేలియాలో ఉద్యోగం వదులుకుని..

ప్రజాసేవలో వైద్యుడు గోపీనాథ్


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గోపీనాథ్ (ఫైల్)

పెనుకొండ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆయన వైద్యుడు. అది కూడా ఆస్ట్రేలియాలో. ఏళ్లపాటు అక్కడ పనిచేశారు. ఫిజియోథెరపిస్టుగా సేవలందించారు. ఆయన కుటుంబమంతా వైద్యులే. ఈ ప్రాంత ప్రజల స్థితిగతులను చూసి, చలించిపోయారు. ఆస్ట్రేలియాలో వైద్యుడి ఉద్యోగం వదులుకుని, ప్రజాసేవ చేయాలని నిశ్చయించుకున్నారు. పెనుకొండలో దశాబ్దానికిపైగా పేదలు, మహిళలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పేదలకు సాయం చేయడంలోనే ఆనందం ఉంది అంటున్నారు పెనుకొండ పట్టణానికి చెందిన డాక్టర్ గోపీనాథ్.

కుటుంబ నేపథ్యం..

డా.గోపీనాథ్ స్వస్థలం తిరుపతి. తండ్రి గోపాల్ డ్రైవర్‌గా పనిచేసేవారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. గోపాల్‌కు కుమారుడు గోపీనాథ్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇంటిలో అందరూ వైద్యులే. కుమార్తెల భర్తలు కూడా వైద్యులే. పేద విద్యార్థులను చూసి చలించిపోయిన ఆయన వారికి తనవంతు సాయం చేసేందుకు పూనుకున్నారు. పెనుకొండకు వచ్చి, స్థిరపడ్డారు. స్థానికంగా పేదలు, మహిళలు, విద్యార్థులకు సాయం చేస్తున్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.21 లక్షలతో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆటస్థలం, అభివృద్ధి, సభావేదిక క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.7లక్షలు ఖర్చుచేసి మండలస్థాయి వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. కరోనా విపత్తు సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు మాస్కులు పంపిణీ చేశారు. 2017లో కియ కార్లపరిశ్రమ రాకతో ఇక్కడ కొరియన్ భాష రాక ఇబ్బంది పడేవారు. కొరియన్ భాషను నేర్పించేందుకు తోడ్పాటు అందించారు. పట్టణంలోని బీసీ హాస్టల్‌లో పేద విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పరికరాలు, దుప్పట్లు, పేద మహిళలకు చీరలను ఏటా పంపిణీ చేస్తున్నారు. రెండు నెలల క్రితం పేద మహిళలకు ఉపాధి కల్పించేందుకు 150 మందికి పది రోజులపాటు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చి అవసరమైన సామగ్రి అందించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలై.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతిలో జరిగింది. ఈస్ట్ ఎస్‌ఐ మహేష్ తెలిపిన మేరకు శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన షేక్‌నూర్ మహ్మద్ ముబారక్ నగరంలోని కరకంబాడిలో ఉంటూ అమర ఆస్పత్రిలో మేల్ స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఇతడు.. లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. వీటిని తీర్చలేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే శుక్రవారం తిరుపతిలోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకుని విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ ఈయన బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బందితో కలిసి ఎస్‌ఐ మహేష్ అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ముబారక్ మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

కార్యకర్తను పరామర్శించిన పల్లె



నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె

నల్లమాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆటో బోల్తా పడి తీవ్రగాయాలపాలైన తిప్పయ్యగారిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త సంచుల నారాయణరెడ్డిని శుక్రవారం మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పరామర్శించారు. అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతులను ఆదుకునేందుకే కందుల కొనుగోలు



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీ‌ష్‌బాబు

ధర్మవరంరూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునేందుకే కూటమి ప్రభుత్వం మద్దతు ధరతో కందులు కొనుగోలు చేస్తోందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీ‌ష్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయనతో ఏడీఏ క్రిష్ణయ్య, మార్క్‌ఫెడ్ డీఎం గీత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో కందుల ధరలు తగ్గినప్పటికీ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం క్వింటాలు రూ.7,550 ప్రకారం కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఓ ముస్తఫా, డీసీఎంఎస్ అధికారి ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు బాబయ్య, ముత్యాలప్పనాయుడు పాల్గొన్నారు.

జెర్సీ ఆవుకు రెండు దూడలు



దూడలతో ఆవు

నంబులపూలకుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యల్లమ్మగుడి సమీపంలో నివాసం ఉంటున్న ఆంజనేయులుకు చెందిన జెర్సీ ఆవు శుక్రవారం రెండు దూడలను ఈనింది. ఇందులో ఒకటి పెయ్య, మరొకటి కోడె దూడలు ఉన్నట్లు రైతు ఆనందం వ్యక్తం చేశారు. తాను పశువులే జీవనాధారంగా జీవిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

కదిరిఅర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడుపుతున్న వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో సీఐ లు నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ ఎంవీఐ రాజేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కదిరిఅర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా, 145 మంది ఇంటర్వ్యూలకు వచ్చారు. 62 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తేజ్‌కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగార్జున పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీ సందర్భంగా ఎక్సైజ్ పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నల్లచెరువు మండలం బాలేపల్లి రహదారిలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. మారుతీకారులో 14 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జిల్లాన్ బాషా తెలిపారు. నల్లచెరువు మండలానికి చెందిన నాగేంద్ర, నాగభూషణంను అరెస్టు చేసినట్లు వివరించారు. 14 బాక్సుల్లో 1,344 టెట్రాప్యాకెట్లు ఉన్నట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి చిన్నపల్లి నరసింహులు భాగస్వామ్యం ఉన్నట్లు తెలిపారు.

కళాశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు ఇచ్చిన వేణుగోపాల్

ధర్మవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ధర్మవరం పట్టణానికి చెందిన పల్లెం వేణుగోపాల్ మూడు కంప్యూటర్లను వితరణ చేశారు. శుక్రవారం పాఠశాల చైర్మన్ బండి వేణుగోపాల్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి సమక్షంలో దాత పల్లెం వేణుగోపాల్ కంప్యూటర్లను కళాశాలకు అందజేశారు. వీటిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఏడాదిలాగే ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు.

తాగునీటి కోసం రాస్తారోకో

గాండ్లపెంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని రెక్కమాను గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితమే తాగునీటి బోరు పైపులు పగిలిపోయాయని, పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. దీంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి భవాని సంఘటనా స్థలానికి వచ్చి వెంటనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములనాయుడు, గంగోజమ్మ పాల్గొన్నారు.



రెక్కమాను వద్ద రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

వేరుశనగకు చీడపీడల దెబ్బ

● తిక్క ఆకు పచ్చతెగులుతో పంట నష్టం ● మందులు పిచికారి చేసినా ఫలితం శూన్యం



తెగులు సోకడంతో రంధ్రాలు పడిన ఆకులు, వేరుశనగకు మందులు పిచికారి చేస్తున్న రైతులు

నంబులపూలకుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట వేరుశనగ నష్టపోయిన రైతులకు.. బోర్లు, బావుల కింద సాగు చేసిన రబీలోనూ నిరాశే మిగులుతోంది. ప్రస్తుతం వేరుశనగను చీడపీడలు దెబ్బ తీస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా డిసెంబర్, జనవరి మాసం సంక్రాంతి వరకు చిరుజల్లులు కురిశాయి. ఎండ ఎక్కువగా లేకపోవడంతో పంటలకు చీడపీడలు ఆశించాయి. అక్టోబర్, నవంబరు మాసంలో విత్తిన వేరుశనగ ప్రస్తుతం నల్లని మచ్చలు(తిక్కఆకు పచ్చతెగులు) వ్యాప్తి చెందడంతో పంటపండుబారిపోయింది. వేరుశనగ పంట కాలం 100 నుంచి 110 రోజులు ఉన్నప్పటికి 80 రోజులకే ఆకుమీద నల్లని మచ్చలు ఏర్పడి పంట పూర్తిగా పండుబారిపోయింది. పట్టుమని చెట్టుకు ఐదు కాయలుకూడా లేవు. ముందస్తుగా వేసిన విత్తనం మంచి దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు రబీలో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. పశుగ్రాసానికి కూడా దక్కకుండా వేరుశనగలో ఆకులు రాలిపోయి, కాండం మాత్రమే మిగిలాయి. మండల వ్యాప్తంగా మూడువేల ఎకరాల్లో వేరుశనగ విత్తన సాగుచేశారు. ఇప్పటికే వేరుశగనకు మూడుసార్లు మందులు పిచికారి చేసినా ఫలితం కనిపించలేదని రైతులు వాపోతున్నారు. ఉదయం మంచు, మబ్బులు ఉండడంతో పురుగులు, దోమ అధికంగా పంటను ఆశిస్తున్నాయి. ప్రస్తుతం వేరుశనగ పంటను తిక్కఆకు పచ్చ తెగులు పట్టి పీడిస్తోంది. దీని వల్ల మొదటి దశలోనే ఊడలు, పిందెలు వృద్ధిలో రాక పంట దిగుబడి తగ్గిపోతోంది.

మూడుసార్లు మందులు పిచికారి చేశా



ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగుచేశాను. పంటకు నల్లమచ్చలు సోకాయి. ఇప్పటికి మూడుసార్లు మందులు పిచికారి చేశా. మందులకే రూ.20 వేలకు పైగా ఖర్చయింది. పెట్టుబడి అయినా వస్తుందో రాదో అనుమానంగా ఉంది. ఇలా అయితే పంటలు సాగు చేయలేం. ప్రతియేడాది ఏదో ఓ రూపంలో నష్టాల బాట పట్టాల్సి వస్తోంది.

-గోపాల్‌నాయక్, రైతు, నల్లగుట్టపల్లితండా

చీడపీడల నివారణ కష్టం



బోరుకింద నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగుచేశాను. నవంబరు చివరిలో వేరుశనగను విత్తాను. ఇప్పటికే రెండుసార్లు మందులు పిచికారి చేసినా చీడపీడలనుంచి పంటను కాపాడుకోలేకపోతున్నాం. దోమలు అధికంగా ఉండడంతో ఆకులపై నల్లమచ్చలు వస్తున్నాయి. వీటిని నివారించకపోతే కాయలు కూడా వచ్చే పరిస్థితి లేదు. చీడపీడల నుంచి కాపాడానికి రాత్రింబవళ్లు పంటను పర్యవేక్షిస్తున్నాం.

- రత్నమయ్య, రైతు, బీమబోయనపల్లి

మందులు పిచికారి చేయాలి

పంటను కాపాడుకోవడానికి మందులు పిచికారి చేయాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోపిడ్ ఒక లీటర్ నీటిలో 0.4ఎంఎల్ పిచికారి చే యాలి. లద్దె పురుగు నివారణకు తయోడిక్ కార్బ్ 200 లీటర్లలో 200 గ్రాములు లేదా ఫ్లూబైండమైడ్40 మి.లీ మందును పిచికారి చేయాలన్నారు. కాండం, ముడ్డకుళ్లు నివారణకు ఒక లీటర్ నీటిలో 2 మి.లీ. హెక్సాకొనజోల్, 2.మి.లీ. డైమిథోయేట్ పిచికారి చేసి, పంటను కాపాడుకోవాలి.

- లోకేశ్వర్‌రెడ్డి, ఏఓ

చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

● అధికారులపై కేసు నమోదు చేయాలి ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



చరణ్ తండ్రిని పరామర్శిస్తున్న సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

బత్తలపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నారాయణ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న చరణ్ కుటుంబాన్ని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం బత్తలపల్లిలోని చరణ్ నివాసానికి చేరుకుని తండ్రి వెంకటనారాయణను పరామర్శించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ విలేకరులతో మాట్లాడుతూ... అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులకు దుఃఖం మిగిలిస్తున్న కళాశాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలో ఫీజులు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థి చరణ్‌ను నిలబెట్టడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడం విషాదకరమన్నారు. కళాశాలకు కనీసం రక్షణ ఏర్పాట్లు ఉన్నాయా అని కూడా పరిశీలించకుండా అనుమతిచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా కనీసం రెండు లేదా మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను రెసిడెన్షియల్ కళాశాలలుగా ఏర్పాటుచేసి కార్పొరేట్ వ్యాపారాన్ని అడ్డుకోవాలన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పార్టీలు, విద్యార్థి సంఘాలను కలుపుకుని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేష్, జిల్లా కార్యదర్శి నాగార్జున, నాయకులు దామోదర్, వంశీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు. చరణ్ కుటుంబాన్ని సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు అప్పులు చేసి తమ పిల్లను చదివిస్తున్నారని తెలిపారు. ఫీజుల కోసం విద్యార్థిని వేధించి ఆత్మహత్యకు కారణమైన కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మధు, కాటమయ్య, వెంకటేసు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి: ఆర్డీఓ



కదిరిలో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరిఅర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు చదువుపై శ్రద్ధపెట్టి ఉన్నతస్థానాలు అధిరోహించాలన్నారు. బాలికలను ప్రోత్సహిస్తే ఆకాశ మే హద్దుగా రాణిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నారాయణరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీనివాసనాయుడు, పాల్గొన్నారు.

● తనకల్లు : బాలికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేమ్మ పేర్కొన్నారు. కొక్కంటి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ధర్మరాజు, కేవీ రమణారెడ్డి, బాబ్‌జాన్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

● ధర్మవరం :పట్టణంలోని సూర్యస్కూలులో జాతీయ బాలిక దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నరేంద్రబాబు మాట్లాడుతూ...బాలికలను కాపాడాకోవాని అన్నారు. ఈ సందర్భంగా సేవ్ గర్ల్ చైల్డ్ అని ప్లకార్డులు ప్రదర్శించారు.

● బుక్కపట్నం : జాతీయ బాలికల దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సీడీపీఓ గాయత్రి బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యసాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● పుట్టపర్తిరూరల్ : ఆడబిడ్డ తల్లిదండ్రులకు భారంకాదని, దేవుడిచ్చిన వరమని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు జోత్స్న, భవ్య పేర్కొన్నారు. జగరాజుపల్లి కేజీబీవీ పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, కేజీబీవీ ఎస్ఓ నాగసుప్రజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాబా షర్ఫొద్దీన్ ఔలియా ఉరుసు



ముస్తాబయిన బాబా షర్ఫొద్దీన్ ఉరుసు జరిగే ప్రదేశం

కదిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రంలో శనివారం నుంచి సోమవారం వరకు బాబా షర్ఫొద్దీన్ ఔలియా ఉరుసు నిర్వహించనున్నారు. ఈ ఉరుసును హిందూ, ముస్లింలు ఐక్యంగా జరుపుకుంటారు. మొదటి రోజు రాత్రి ఆర్యవైశ్యకు చెందిన అప్పన్నశెట్టి కుమారుడు అశోక్ కుటుంబం నుంచి గంధం తీసుకురావడంతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. చాందీబండ్లు, పక్కీల జల్సాలతో ఊరేగింపుగా బాబా షర్ఫొద్దీన్ దర్గా వద్దకు గంధం తీసుకొస్తారు. అలాగే ఆదివారం ఆనవాయితీగా ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే నూతన కాలువ గ్రామం నుంచి గంధం తీసుకొస్తారు. ఈ రెండురోజులపాటు ఖవ్వాలీ కార్యక్రమాలు ఉంటాయి. చివరి రోజు సోమవారం హరికథ కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఉరుసును హిందూ, ముస్లింలు కలిసి జరపుకోవడం విశేషం. ఉరుసు జరిగే ప్రాంతమంతా తినుబండారాల అంగళ్లు, ఇతర వ్యాపారాలతో నిండిపోయింది. ఈ ఉరుసుకు తలుపుల మండలం నుంచే కాక రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. ఇక్కడ ప్రార్థనలు చేసిన చక్కెరను అన్ని మతాల వారు స్వీకరిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తూకాల్లో మోసంపై డీలర్ల ఆగ్రహం

● స్టాక్ పాయింట్ సిబ్బందితో వాగ్వాదం ● అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తా: ఎమ్మెల్యే



స్టాకిస్టుతో వాగ్వాదం చేస్తున్న డీలర్లు

తనకల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్టాక్ పాయింటులో తూకాల్లో జరుగుతున్న మోసాలపై డీలర్లు మండిపడ్డారు. ఈ మేరకు మండలంలోని డీలర్లు టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్టాక్‌పాయింట్ వద్దకు వెళ్లి స్టాకిస్టు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. స్టాక్ ఎందుకు తక్కువ వచ్చిందని నిలదీశారు. తమ వద్ద ఉన్న బఫర్‌కన్నా, ఎక్కువ చూపి, తక్కువ స్టాక్ సరఫరా చేయడం ఏమిటని నిలదీశారు. వచ్చిన ఆర్వోలకు మాత్రమే స్టాక్ సరఫరా చేస్తామని అక్కడి సిబ్బంది తెలిపారు. కమిషనర్ వద్ద నుంచి తమకు వచ్చిన ఆర్వోల ప్రకారమే స్టాక్ తరలించామన్నారు. తమ వద్ద బఫర్ లేకపోయినా, ఉన్నట్లు చూపడం ఏమిటని డీలర్లు ప్రశ్నించారు. స్టాక్ పాయింట్ నుంచి తక్కువ తూకాలు వస్తున్నాయని, ఈవిషయంపై ప్రశ్నించడంతో సిబ్బంది నీళ్ల నమిలారు. ఇక మీద తూకాలు తక్కువ రాకుండా డీలర్ల సమక్షంలోనే తుకాలు వేసి పంపుతామని తెలిపారు. స్టాక్ పాయింట్‌లో బియ్యం సంచులను కలిపి తూకాలు వేస్తున్నారని, 40 కిలోలు ఉన్న మూటలను కూడా 50 కిలోలుగా లెక్కిస్తారని, డీలర్ల ఆధారాలతో ప్రశ్నించారు. ఈ విషయాన్ని తహసీల్దార్ శోభాసువర్ణమ్మ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు ఈ విషయాలు తమకు తెలియవు అని సమాధానం చెప్పారు. దీంతో విషయాన్ని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ విషయంపై జిల్లా అధికారులతో చర్చించి సమస్య పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు మంజునాథ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పరిటాల రవి



పరిటాల రవి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహోన్నత వ్యక్తి పరిటాల రవీంద్ర అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో పరిటాల చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల కోసం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్, ఎద్దుల క్రిష్ణమూర్తి, మోపూరి శెట్టి చంద్రశేఖర్, బాహుద్దీన్, రాజేంద్రనాయుడు, సులేమాన్, హైదర్, కుటాగుళ్ల గంగరాజు, శంకర్, క్రిష్టప్ప, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవీంద్రకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వెంగమాంబ భాస్కర్

● ధర్మవరం : మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ధర్మవరానికి చెందిన టీడీపీ నాయకులు వెంగమాంబ భాస్కర్, పార్థసారధి, హరి, లక్ష్మన్న వెంకటాపురం వెళ్లి పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పరిటాల రవీంద్ర అని ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పేర్కొన్నారు.

ఆశయాలను కొనసాగిద్దాం



పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ధర్మవరం టీడీపీ నాయకులు

● ధర్మవరం: మాజీమంత్రి పరిటాల రవీంద్ర ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో శుక్రవారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిటాల రవీంద్ర బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేశారన్నారు. అనంతరం వెంకటాపురం వెళ్లి పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, పణికుమార్, పరిశే సుధాకర్, మద్దిలేటి, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్, షరీఫ్, ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, సనత్, వరదరాజులు, రహీం, కిష్ట, శ్రీనివాస్‌రాజు, శ్రీరాములు, విజయ్‌చౌదరి, నారాయణస్వామి, ఆది, మహేశ్, రవి పాల్గొన్నారు.

● తాడిమర్రి: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని శుక్రవారం తాడిమర్రిలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక రెడ్డి చావిడి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వుసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచి రామ్మోహన్, నాయకులు గోనుగుంట్లభూషణ్, భాస్కర్‌గౌడ్, పక్కీర్‌రెడ్డి, గణేశ్, రవీంద్రారెడ్డి, బాబు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ : మండల కేంద్రంలో పరిటాల రవీంద్ర వర్ధంతిని టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాతూరులో రాత్రి సప్తమాంకాలు అనే నాటకాన్ని నిర్వహించారు.

● బత్తలపల్లి : మాజీమంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీటీ ఆసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, రమణ, సూరి, శ్రీరాములు పాల్గొన్నారు. తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో విజయవాడ, ధర్మవరంలోని అన్నా క్యాంటీన్లలో వారు అన్నదానం నిర్వహించారు.

● కొత్తచెరువు : పరిటాల రవీంద్ర ఆశయాలను నేటి తరానికి తెలిసే విధంగా కొనసాగిద్దామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పెయింటింగ్‌లో పురం విద్యార్థికి బంగారు పతకం


బంగారు పతకం సాధించిన విహాన

హిందూపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లో పురం విద్యార్థి ప్రదర్శించిన ప్రతిభకు బంగారుపతకం లభించినట్లు శిక్షకురాలు సరస్వతి వెంకటేష్ తెలిపారు. లలిత కళాసెంటర్ ఫర్ విజువల్ ఆర్ట్స్ అధ్యక్షుడు జయ వినసుకుమార్ ఆధ్వర్యంలో బెంగళూరు వారు 2024 మేనెలలో 17వ నేషనల్ స్టూడెంట్ ఆర్ట్ పోటీలు నిర్వహించారని తెలిపారు. వాటికి సంబంధించిన ఫలితాలు ఈ నెల 22న వెలువడినట్లు ఆమె తెలిపారు. ఇందులో హిందూపురం నుంచి 34 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో హిందూపురంకు చెందిన విద్యార్థిని విహానక్షత్రికి పెయింటింగ్‌లో బంగారు పతకం దక్కినట్లు పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్థిని నేహకు, ఐదవ తరగతి విద్యార్థి పూర్వ అయాన్‌లకు పెన్సిల్ షేడ్‌లో సిల్వర్ మెడల్స్ దక్కాయన్నారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ


పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేస్తున్న అధికారులు

గోరంట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని కమ్మలవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటవస్తువులను బరోడా బ్యాంక్ వారు శుక్రవారం పంపిణీ చేశారు కమ్మలవాండ్లపల్లి వద్ద బెస్ట్ యూనివర్సిటీలో నూతనంగా బ్యాంక్‌ఆఫ్ బరోడా బ్యాంక్‌ను ఇటీవల ప్రారంభించారు. బ్యాంక్ అధికారులు గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకునివిద్యార్థులకు క్రికెట్, షటిల్, బ్యాట్మింటెన్, టెన్నికాయిట్, బ్యాస్కెట్‌బాల్, క్రీడా సామాగ్రిని అందించారు. ఉపాధ్యాయులు బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు త్రివిక్రమ్, శ్రీవాణి, విద్యార్థులున్నారు.

హైవే భూసేకరణ కోసం నేడు గ్రామసభలు

గోరంట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ హెచ్ 342 రోడ్డు కోసం అదనపు భూసేకరణకు శనివారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మారుతి తెలిపారు. గ్రామ సచివాలయాల్లో శనివారం మందలపల్లిలో ఉదయం 10.30కు, గోరంట్ల -1లో 12.30కు, మల్లాపల్లాలో మధ్యాహ్నం 2గంటలకు బూదిలిలో 3.30కు, గ్రామసభలు జరుగుతాయన్నారు. పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ గ్రామసభలకు సంబంధిత భూయజమానులు హాజరుకావాలన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వెంకటేశులు

చిలమత్తూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా హిందూపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశులు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ యునస్ బాబు బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో హిందూపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశులను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు.

రంగు పరిశ్రమల కార్మికుల కార్యవర్గం

సోమందేపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : రంగు పరిశ్రమలకు చెందిన కార్మికుల నూతన కార్యవర్గాన్ని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి బాలస్వామి మాట్లాడుతూ సోమందేపల్లిలో ఎనిమిది రంగు పరిశ్రమలున్నాయన్నారు. ఇందులోపనిచేసే 50మంది కార్మికులు యూనియన్‌గా ఏర్పడి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షునిగా లింగప్ప, ఉపాధ్యక్షునిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కుమార్, సహాయ కార్యదర్శి రాజు, కోశాధికారిగా శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్ల సమస్య పరిష్కారం

పరిగి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాం నుంచి మండలంలోని కొడిగెనహళ్లి బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్నమరుగుదొడ్ల సమస్య పరిష్కారమైంది. వార్డన్ చిన్నయ్యబాబు సమస్యను బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం నాటికి సెప్టిక్‌ట్యాంక్‌పై కప్పు నిర్మించి విద్యార్థుల సమస్యను పరిష్కరించారు.

ఘనంగా వాల్మీకి ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సూరప్పకట్ట వద్దనున్న వాల్మీకి రామదేవాలయంలో శుక్రవారం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌లకు వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించి హోమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూలవిరాట్‌లను సర్వాంగసుందరంగా ముస్తాబుచేశారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు వైఎన్‌బి. భాస్కర్, కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మహిళలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మాపీడీ విశ్వజ్యోతి అన్నారు. హిందూపురం మునిసిపల్ కార్యాలయంలో మెప్మా విభాగం ఆధ్వర్యంలో మహిళా సంఘాల ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా పట్టణంలోని పేదలకు ఇస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకునే విధంగా ఆర్పీలు మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. రుణాల ద్వారా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. దీనివల్ల పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక, సామాజిక పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓబీలు, ఆర్పీలకు మెప్మా సంబంధించిన అంశాలను పొందుపరిచిన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, మెప్మా అధికారి గంగులయ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతర్

- అనుమతి లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- దుద్దేబండ పంచాయతీ ఆదాయానికి భారీ గండి
- చోద్యం చూస్తున్న అధికారులు


దుద్దేబండ క్రాస్‌లో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్

పెనుకొండ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కియ, అనుబంధ పరిశ్రమలు రావడంతో సమీపంలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. కియా అనుబంధ పరిశ్రమలు దుద్దేబండ ప్రాంతంలో ఎన్నోవెలిశాయి. అనుబంధ పరిశ్రమల నుంచి కియ పరిశ్రమకు అవసరమయ్యే సామాగ్రిని కంటైనర్ల ద్వారా నిత్యం తరలిస్తుంటారు. పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, కూలీలు, రహదారిపై నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో దుద్దేబండ రహదారి బిజీ బిజీగా మారింది. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు రియల్టర్లు దుద్దేబండ రహదారిపక్కన అహుడా, పంచాయతీ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా లేఅవుట్లువేసి విక్రయాలు సాగిస్తున్నారు. అక్రమ లేఅవుట్లలో పంచాయతీ అనుమతులు లేకుండానే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ లేఅవుట్లలో నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలపై తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి దివాకర్‌ను వివరణ కోరగా దుద్దేబండ సమీపంలో 454సర్వేనంబరు భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణంపై ఇదివరకే యాజమాన్యానికి నోటీసులు అందించామని, అయినావారు వినకుండా భవన నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పై అధికారులు తెలిపామన్నారు. పంచాయతీ అనుమతులు పొందేందుకు సంప్రదించగా అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చేదిలేదని చెప్పామన్నారు. ఇప్పటికే నోటీసులు కూడా అందజేశామన్నారు.

పరిటాల ఆశయ సాధనకు కృషి : ఎంపీ బీకే


పార్టీ కార్యాలయంలో పరిటాలకు నివాళులు అర్పిస్తున్న బీకే

పెనుకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : పెనుకొండ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దివంగత పరిటాల రవీంద్ర ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పరిటాల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీపీ నాయుడు, కేశవయ్య, బక్కంపల్లి రామక్రిష్ణ, కన్వీనర్ రవిశంకర్, బోయ అనీల్‌కుమార్, పాలడుగు చంద్ర, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పరిటాల శ్రీరాములు కళాశాలలో

స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ మంత్రి కళాశాల వ్యవస్థాపకులు దివంగత పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని ప్రిన్సిపాల్ కేశవరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఉదయం పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, యశోదరాణి, ప్రతాప్, రామన్న, చంద్రమోహన్, కాంతారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండలో పరిటాల విగ్రహం ఏర్పాటు చేస్తాం

పెనుకొండ టౌన్: పెనుకొండ పట్టణం ప్రధాన కూడలిలో వచ్చే ఏడాది స్వర్గీయ పరిటాల శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మాధవనాయుడు, చిన్నవెంకటరాముడు, కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య, పాలడుగు చంద్ర, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


పరిటాల రవికి నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

బాలికలు జాతీయ సంపద

- డీఎస్పీ వెంకటేశ్వరరావు

పెనుకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికలు మన జాతీయ సంపద అని, వారిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎస్పీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆర్డీటి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి తెలుగుతల్లి సర్కిల్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీడీపీఓ శాంతలక్ష్మీ, ఆర్డీటి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమ్మాయిలు సమాజంలో ఎదురయ్యే సమస్యలపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వారికి తల్లిదండ్రులు చిన్నవయసులో వివాహాలు చేయడంవల్ల శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. అలాకాకుండా బాల్యవివాహాలు చేయాలని నిర్ణయిస్తే బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.


పెనుకొండలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షతన బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికలకు ఎన్నో అవకాశాలు ప్రభుత్వం కల్పించారని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటి మహిళా విభాగం టీమ్‌లీడర్ ఆదినారాయణ, ఏరియా టీమ్‌లీడర్ సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని ఖాజాపురం కేజీబివి పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

అగళి: అగళి మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం సీడీపీఓ నాగమల్లీశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ, సీనియర్ అసిస్టెంట్ గుర్రన్న, వీఆర్ఓ దొడ్డేగౌడ్‌లు హాజరయ్యారు.

రొళ్ల:మండలంలోని బి.జి.హళ్లి హైస్కూల్‌లో హెడ్మాస్టర్ పూజారప్ప ఆధ్వర్యంలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వృద్ధుడి ఆత్మహత్య

సోమందేపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని నడింపల్లి గ్రామంలో శుక్రవారం నరసింహప్ప(63) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. నడింపల్లి ఎస్సీ కాలనీకి చెందిన నరసింహప్ప గత కొన్నేళ్లుగా అస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా జబ్బు నయం కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం గొర్రెలను మేపడానికి వెళ్లిన అతను ఊరి చివరన ఉన్న చింతతోపులో చెట్టుకు ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సాయంత్రం గొర్రెల కాపర్లు దీనిని గమనించి ఈ మేరకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌లు తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

షట్టర్ ధ్వంసం.. అంగడిలో చోరీ


షట్టర్ తాళం పగులగొట్టిన దృశ్యం

మడకశిర టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణంలో ఇటీవల దొంగలు రాత్రి వేళ ప్రధాన రహదారుల పక్కన ఉన్న దుణాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. చివరకు దేవాలయాల హుండీలను సైతం వదలడం లేదు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో మధుగిరి ప్రధాన రహదారిలో ఉన్న ఎస్ఎల్‌వీ సూపర్‌మార్కెట్‌లో నలుగురు దొంగలు కలిసి షట్టర్ లాక్‌ను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆసమయంలో నగదు రూ.600 ఎత్తుకెళ్లారు. అందులో ఉన్న సరుకులను తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో దుకాణం పై అంతస్తులో ఉన్న యజమాని రావడంతో వారు పరారయ్యారు. సీసీ కెమెరాలలో దొంగలు దొంగతనం చేసిన దృశ్యాలు రికార్డయ్యాయి. గత నెలలో సైతం పావగడ, పెనుకొండ రహదారులతోపాటు అమరాపురం రహదారిని ఆనుకొని ఉన్న ఆరు దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ నిర్వహించి దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.

యల్లమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో యల్లమ్మదేవి

హిందూపురం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నింకంపల్లి రోడ్డులో ఉన్న శ్రీ యల్లమ్మదేవి ఆలయంలో పుష్యమాస శుక్రవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి శుక్రవారం విశిష్టం కాబట్టి ఆలయంలో ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూలు నగలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

దళితుడిపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

గోరంట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింపల్లికి చెందిన దళితుడు లారీడ్రైవర్ ఆంజనేయులపై జరిగిన దాడి కేసులో ఏడుగురిని పెనుకొండ డిఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఆంజనేయులు మైనర్ బాలికను వెంట తీసుకెళ్లడంతో అమ్మాయి బంధువులు రెండురోజులక్రితం దాడిచేసి గాయపరిచిన విషయం తెలిసిందే. అమ్మాయి బంధువుల ఫిర్యాదు మేరకు దళితునిపై ఫోక్సోకేసు నమోదుకాగా, ఫిర్యాదు మేరకు ఏడుగురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నార్సింపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, బోయ ఆది నారాయణ, చాకలి గణేష్, చాకలి రాజశేఖర్, చాకలి వెంకటలక్ష్మమ్మ, చాకలి ఈశ్వరమ్మ, చాకలి పద్మావతిని పోలీసులు అరెస్టుచేసి పెనుకొండ కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు నిందితులకు 15రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

గోరంట్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రయ్యగారిపల్లికి చెందిన వెంకటలక్ష్మి(70) ద్విచక్రవాహనం ఢీకొని గాయపడి, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు. ఎర్రయ్యగారిపల్లికి చెందిన వెంకటలక్ష్మమ్మ రోడ్డు పక్కన నిలబడి ఉండగా, ముత్తరాయునితండాకు చెందిన మునిచంద్రనాయక్ ద్విచక్రవాహనంపై ఆమెను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన ఆమెను గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా, ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం హిందూపురం, బెంగుళూరు తరలించారు. పరిస్థితి చేయిదాటిందని బెంగుళూరులో వైద్యులు తెలపడంతో స్వగ్రామానికి తీసుకు వస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు చెప్పారు. శవానికి పెనుకొండ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ, బ్రాహ్మణ, కాపు, వైశ్య, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. 21 సంవత్సరాల నుండి 61 ఏళ్లలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక యూనిట్ విలువ రూ.2లక్షల నుండి రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రధానమంత్రి జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకొనేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తి చేసుకొన్నవారు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులకు క్యాస్ట్, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం కాపీలను, ఫోన్ నంబర్‌ను జతచేయాలన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం


సానిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష

పెనుకొండ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కందిపంట సాగుచేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష పేర్కొన్నారు.రొద్దం మండలంలోని సానిపల్లి గ్రామంలో శుక్రవారం కాఫీ విత్ వైసీపీ లీడర్స్ గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. కందిసాగుచేసిన రైతులను దిగుబడిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొద్దం మండలంలో వేలాది ఎకరాల్లో రైతులు, కందిపంట సాగుచేసి దిగుబడి అందక తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

మడకశిర రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష తెలిపారు. మండలంలోని ఈచలేడ్డి గ్రామంలో శుక్రవారం కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం స్థానిక సర్పంచు చెన్నయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో వైసీపీ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ఈలక్కప్ప, వైటీ ప్రభాకరరెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ


రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శిస్తున్న గుండుమల

మడకశిర రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని గౌడనహళ్ళి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నాయకుడు అశ్వర్థనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకొన్న గుండుమల శుక్రవారం ఆగ్రామానికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారిని అన్నీ విధాల ఆదుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసమూర్తి.మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ. జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు గోవిందప్ప పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఈ

అగళి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : అగళి మండలకేంద్రంలో ట్రాన్స్‌కో డీఈ భూపతి శుక్రవారం పర్యటించారు. విద్యుత్‌శాఖ లైన్‌మెన్ గురువారం శివకుమార్ మృతిచెందడంతో పరిశీలనకు ఆయన వచ్చినట్లు విద్యుత్ అధికారులు ఏడీ నాగన్న, ఏఈ నాగరాజు తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సబ్‌స్టేషన్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఆ పొలం రైతు నగేష్‌తో వివరణ తీసుకున్నారు. అధికారులతోనూ, సబ్‌స్టేషన్ ఆపరేటర్లతో చర్చించారు.